# మృత్యువు అక్కడుంది!

**నెల్లూరు ప్రాంతాల్లో రెడ్లు చేసే వ్యాపారాల్లో సంచార వ్యాపారమైన బాతుల వ్యాపారం ఒకటి. ఇదెలా చేస్తారంటే... యానాదివాళ్ళని పిల్చి ఏడాదికింతని మాటాడుకుని ఒకో కుటుంబానికి వెయ్యి బాతుల చొప్పున అప్పగించి సరిగ్గా కోతలప్పుడు కోస్తా జిల్లాల వేపు పంపేస్తుంటారు. రైతుల్తో మాటాడుకుని నవంబరు డిసెంబరు నెలల్లో నీరు పెట్టి ఉన్న చేలల్లో బాతుల్ని దింపుతారు యానాదిజనం. నీళ్ళకిందున్న ఒడ్ల గింజల్నీ, పురుగుల్నీ బాగా దేవుకుతినే బాతులు గుడ్లు బాగా పెడతాయి. వాటిని అట్టపెట్టెల్లో దాచి వాళ్ళ యాజమాని తాలూకు లారీకి అప్పగిస్తారు వీళ్ళు.**

టైగర్ అని పేరెట్టుకున్న బలమైన ఊరకుక్కనీ పదిహేనేళ్ళ కొడుకు శ్రీనిగాడ్నీ ఇరవయ్యేళ్ళ కూతురు నాగలక్ష్మినీ తీసుకుని మా వూరు వచ్చిన ఏభైఏళ్ళ మునిరత్నం, ఆ ఏడాది తేతలి బసివిరెడ్డిగారితో మాటాడుకుని వాళ్ళపొలంలో గుడారం వేసుకున్నాడు.

వాళ్ళనాన్న, తమ్ముడు బాతుల్ని తోలుకునెళ్ళిపోయాకా గుడారంలో ఒంటరిగా ఉండే నాగలక్ష్మి వంట చేసేసేకా టైగర్ని గుడారం దగ్గర కాపలా పెట్టి ఆ అందమైన పొలాల్లోనూ, ముంతమామిడి చెట్ల గుబురుల్లోనూ సపోటాచెట్ల నీడల్లోనూ నడుస్తుంటే లేడికాళ్ళు తన కొచ్చినట్టు ఇదైపోతుంది. మనసంతా ఎక్కడో తేలిపోతున్నట్టుగా ఉంది.

ఆ పొలాల యాజమాని బసివిరెడ్డిగారికి ఊళ్ళో అయితేనేం చేగల్నాడులో అయితేనేం ఏభై ఎకరం ఉంది. అన్నవరానికీ తునికీ మధ్యలో ఏభై ఎకరాల మామిడితోటుంది.

నలుగురు ఆడపిల్లల తర్వాత పుట్టాడు దొరబాబు. ఆ కుర్రోడు పుట్టాకా చాలా బాగా కలిసొచ్చింది బసివిరెడ్డికి. ఉన్నది రెట్టింపయ్యింది.

చాలా అందగాడైన దొరబాబుది అదోరకం తత్వం. ఊళ్ళో రెడ్లు కుర్రోళ్ళెవరితోనూ కలవడు. దాంతో, వాళ్ళంతా ఈడికి చాలా నిక్కు, చాలా గీర అనుకోవడం మొదలెట్టారు. ఇంట్లో ఉన్నంతసేపూ సావిట్లో మూలకిటికీ దగ్గరకూర్చుని వీధి వేపు చూస్తా ఉండిపోతాడు. కూచోబుద్ధవనప్పుడు పొలం వెళ్ళిపోయి వాళ్ళ దూళ్ళసావిట్లో తను పెంచుకుంటున్న గిన్నికోళ్ళనీ, సీమకుక్కల్నీ పక్షుల్నీ తను కొనుక్కొచ్చిన మేతల్తో తన చేత్తోనే తినిపిస్తా ఆనందంగా గడిపేస్తుంటాడు. మధ్యాన్నం ఇంటి దగ్గర్నించొచ్చే ముంతని వాటి మధ్యే విప్పుకుతింటాడు.

* * *

ఆర్యవటం క్రిష్ణారెడ్డిగారింట్లో పెళ్ళని కబురొచ్చింది బసివిరెడ్డికి. జీపేసుకు బయల్దేర బోతుంటే ''నేనూ వస్తాను'' అన్నాడు దొరబాబు. ఇంతలో వచ్చిన భార్య తులశమ్మ ''చీర పెడతానని రాజేశ్వరస్వామి గుళ్ళో అమ్మవారికి మొక్కుకున్నాను హసన్‌బాదలో చీరలు నేసే బళ్ళ బాలసుబ్రమణ్యానికి జరీ చీరొకటి నేసి పట్రమ్మని చెప్పండి'' అంది. ''సరే'' అని జీపుని వెల్ల మీంచి కాకండా ద్రాక్షారామం మీంచి పోనిమ్మన్నాడు డ్రైవర్ని.



హసన్‌బాదలో పని జూసుకుని విజయరాయుడు పాలెం దాటబోతుండగా రోడ్డుకి ఎడం పక్కన పెద్ద చింతచెట్టుకింద మేస్తున్న అందమైన నెమలి కనిపించింది. జీపు ఆపమని జెప్పిన దొరబాబు ఆ నెమలిని పట్టుకోబోతుంటే అది అందకండా ఎగురుకుంటా రెండెకరాల మావిడితోట మధ్యలో ఉన్న పాతకాలంనాటి దివాణంలోకెళ్ళిపోయి అక్కడ రాచ ఉసిరిచెట్టు నీడలో మేస్తున్న మగనెమలి పక్కన జేరిపోయింది. ఈలోగా లోపల్నుంచొచ్చిన ఎత్తుగా బలంగా ఉన్న అరవయ్యేళ్ళాయన ''ఎవరు కావాలి?'' అన్నాడు.

''ఆ నెమలి కావాలండి'' అన్నాడు దొరబాబు.

''అది మా అబ్బాయి లంబసింగి అడవుల్లోంచి తెచ్చుకున్నాడు...మేం ఇవ్వం'' అన్నాడు ముసలాయన.

''ఆ నెమలి నాకు కావాలండి ఎంత డబ్బయినా సరే ఇస్తాం'' అన్నాడు దొరబాబు.

చాలా కోపమొచ్చేసిందా ముసలాయనకి. ఆయన పేరు లచ్చన్నకాపుగారంట ఆ ఏరియా జమీందార్లంట.

బయటికొచ్చేసిన దొరబాబు జీపులో తనకోసం ఎదురుచూస్తా కూర్చున్న బసివిరెడ్డితో జరిగిందంతా చెప్పి ''నూరు ఆరైనా సరే వాళ్ళింట్లో ఉన్న ఆ నెమలి నాకు కావాలి'' అని కూర్చున్నాడు.

''సరే పద జీపెక్కు'' అన్న బసివిరెడ్డిగారు ఆర్యవటం నించి ఇంటికొచ్చేసేకా ఈంద్రపేటలో ఉండే దొంగక్రిష్ణుడ్ని పిలిపించి విజయరాయుడుపాలెంలో లచ్చన్నకాపుగారి దివాణానికెలా గెళ్ళాలో చెప్పి ''ఆళ్ళింట్లో ఉన్న నెమలిని దొంగతనం చేసుకురావాల్రా'' అన్నారు.

అంత పెద్ద మనిషి ఆ చుట్టు పక్కల ఊళ్ళలో గొప్ప పేరున్న బసివిరెడ్డిగారు దొంగతనం చెయ్యమని తనకి పురమాయిస్తుంటే నోటమాటపడిపోయిన దొంగక్రిష్ణుడు''ఆకొడుకు కోసం ఏమైనా చేస్తారు ఈరు'' అనుకుని బయల్దేరేడు.

మర్నాడు తెల్లవారుఝామున నెమలితో వచ్చిన దొంగక్రిష్ణుడికి వెయ్యినూట పదహార్లిచ్చిన బసివిరెడ్డిగారు నిద్రోతున్న దొరబాబుని లేపి నెమలిని అప్పగించేడు. నిద్రెగిరిపోయిన దొరబాబు చేత్తో దాన్ని దువ్వి గుండెలకి అదుముకుని రాంపురం వెళ్ళి అది ఇష్టంగా తినే గంటెలూ, చోళ్ళు, జొన్నలూ, రాగులూ కొనుక్కొచ్చి తనే స్వయంగా తినిపించడం మొదలెట్టేడు. ఎరకలి ఈరన్నని పిల్చి పాముల్ని పట్టుకు రమ్మని వాటిని చంపించి నెమలికి పెట్టేడు.

* * *



ఆ శీతాకాలం సాయంత్రం.

చల్లగా వీస్తున్న గాలికి బసివిరెడ్డిగారి పొలంలో మొగుడూ పెళ్ళాల్లా పెరిగిన రావి చెట్టు, వేపచెట్టూ చక్కగా మెలేసుకుపోతున్నాయి. చింతచెట్టు కాయల్ని బెడ్డముక్కల్తో దుళ్ళ గొడ్తున్నారు పాలేరు కుర్రోళ్ళు, చదును చేసిన ఆకుమడి నీళ్ళలో ఒక కొంగ తన నీడని చూసుకుంటుంటే మిగతా కొంగలు వరిచేలో కోసిన పనల మధ్య పురుగుల్ని ఏరుకుని ఇష్టంగా తింటున్నాయి.

క్రీషీట్రాక్టరేసుకుని పొలం వచ్చిన దొరబాబు పంజరంలో పెట్టిన నెమలి మెడకి మేకు గుచ్చుకుపోయి రక్తం కారడం చూసి ఆ పంజరం తలుపులు తీసి బయటికి వదిలేడో లేదో గాలిలో కెగిరిన నెమలి తనకి దొరకడానికి నానాతిప్పలూ పెడ్తుంది. దాన్ని వెతికే పనిలో గుడారం దగ్గరున్న నాగలక్ష్మిని చూసేడు దొరబాబు.

దొరబాబుని నాగలక్ష్మి చూసింది.

ఆ రాత్రి, దూరంగా రాంపురంలో అన్ని పక్కలకీ తిరుగుతా కనపడే సర్కసోళ్ళలైటు పసలపూడి చుట్టూరా తిరుగుతుంది. తూర్పుపేట గుడి స్పీకర్లలోంచి బాలభక్త సమాజం వాళ్ళు చేస్తున్న భజన వినిపిస్తుంది. ఉన్నట్టుండి వీస్తున్న గాలికి పారిజాతం పువ్వులు జలజలా రాలి మళ్ళీ ఆగిపోతున్నాయి.

వాకిట్లో నూతి పళ్ళేనికీ ముద్దమందార చెట్టుకీ మధ్యన మడత మంచం వేసుకుని వెల్లకిలా పడుకున్న దొరబాబుకీ తెగ గుర్తుకొస్తుంది నాగలక్ష్మి. ఆ మనిషినే తల్చుకుంటున్న దొరబాబుకి అస్సలు నిద్రపట్టలేదా రాత్రి.

ఇంకా తెల్లారక ముందే క్రిషి ట్రాక్టరేసుకుని పొలం వచ్చేసిన దొరబాబు సందు దొరికి నప్పుడల్లా చూడ్డం మొదలెట్టేడు నాగలక్ష్మిని.

వారం రోజులపాటు ఒకళ్ళనొకళ్ళు చూసుకుంటానే ఉన్నారిద్దరూ.

నాగలక్ష్మిని ఒక్కపూట చూడకపోతే బెంగెట్టుకునే దశకి వచ్చేసేడు దొరబాబు. లోపలేదో జ్వరమొచ్చినట్టు అదోరకంగా చాలా హాయిగా ఉంది దొరబాబుకి. ఇక అన్ని పనులూ మానేసేడు.

* * *

ఆ శీతాకాలం పొద్దుట మంచు పొగల్తో కప్పుకుపోయి ఉన్నాయి పొలాలు. కోతలు కొయ్యడానికి బయల్దేరిన ఆడోళ్ళు కచ్చాలు మోకాళ్ళ పైదాకా ఎగ్గట్టి ముంత లట్టుకు నడుస్తున్నారు గట్లమ్మట. గన్రెడ్డిగారి మెట్టమీద కాల్తున్న ఇటిక బట్టీ గొట్టంలోంచి తెరిపనేది లేకండా లేస్తున్నాయి పొగలు.

తేతలి బసివిరెడ్డిగారి కోసేసిన పొలాలకి ఒకమూల మెట్టమీద వేసి ఉన్న నీలం రంగు గుడారం ముందు ఇటుకల్తో అందంగా కట్టిన పొయ్యి మీద కుండలో వేణ్ణీళ్ళు కాగుతున్నాయి. కాస్త దూరంగా లకలుకా చప్పుళ్ళు చేస్తా దడి లోపల కల తిరుగుతున్నాయి బాతులు. పక్కనే నిండా నీళ్ళలో పిల్లకాలవ దానికి కాస్త దూరంగా నాలుగు నారింజచెట్లు. పళ్ళు కిందకి దిగిపోయి ఉన్నాయి.

నాగలక్ష్మి కట్టిచ్చిన ముంతలు అందుకున్నాడు మునిరత్నం. దడివిప్పి బాతుల్ని బయటికి తోలుతున్నాడు శ్రీనిగాడు. బాతులెళ్ళాకా కాళీ అయిన దడిలో అవి పెట్టిన గుడ్లు ఏరి అట్టపెట్టెలో దాచిన నాగలక్ష్మి, బోదికాల్వలో సబ్బెట్టి ముఖం కడుక్కుని రాజమండ్రీ జాలీ పేసుపౌడరు రాసుకుని, టైగర్ని మకాం దగ్గర కాపలా పెట్టి, గుడారానికి కాస్త దూరంలో సీమసింత చెట్టు దగ్గర తనకోసమే ఎదురుచూస్తా నిలబడ్డ దొరబాబు దగ్గరకెళ్ళింది.

బాతుల్ని తోలు కెళ్తుంటే దారిలో ఎదురైన గుంపోడు రెండు గునపం కోళ్ళు, జమ్ముకోళ్ళు చవగ్గా అమ్మితే ఇగురొండమందారని వాటిని పట్టుకుని వెనక్కొచ్చిన మునిరత్నం సీమసింత చెట్టుకిందున్న ఆ ఇద్దర్నీ చూసి అవాక్కయిపోయేడు. నోట్లోంచి మాటలకి బదులు చొంగలు కారినియ్యి.

''అయ్యబాబోయ్ ఆ బసివిరెడ్డిగారి కొడుకుతోనా ఇది పెట్టుకుంట... ఆయనగారికి తెలిస్తే ఇంకేవన్నా ఉందా...దేవుడోయ్'' అని పరుగెట్టుకుంటా వెళ్ళి పొలాల్లో ఉన్న బాతుల్ని వెనక్కి తోలుకొచ్చేసి గుడారం విప్పేసి కూతుర్ని చావబాది వాళ్ళతో ఆవూరు దాటి వెళ్ళిపోతుంటే దారికి అడ్డం పడిపోయిన తేతలిబసివిరెడ్డిగారి పాలేళ్ళు ''మాకాపుగారు రమ్మంటున్నారు'' అన్నారు.

దెబ్బకి మునిరత్నం గుండెలు జారిపోయినియ్యి ''ఇక ఈ వూరు పొలిమేర దాటి వెళ్ళడం ఈ జన్మకి జరగదు'' అనేసుకుని కూతుర్నీ కొడుకునీ ''ఇక్కడే చావండ''ని తిట్టి వాళ్ళెనకాల వెళ్ళేడు.

లోపలికొస్తున్న మునిరత్నానికి ఎదురెళ్ళిన బసివిరెడ్డిగారు ''మా దొరబాబు మీ పిల్లని ఇష్టపడ్డాడట గదా...'' అన్నాడు.

"క్షమించండి దొరగారూ నాకు ఇందాకే తెల్సింది" అన్నాడు మునిరత్నం.

నవ్వేసిన బసివిరెడ్డిగారు "మా దొరబాబుకి ఇష్టమైనదాన్ని దేన్నీ మేం కాదనలేం. మావోడి బొటనవేలుకి గొప్పు తగిలి చుక్కంత రక్తం పోతేనే మాకు ప్రేణమే పోయినట్టయి పోద్ది... ఆడిష్టమే మా ఇష్టం... మావోడు ఇష్టపడ్డ మీ పిల్లే మాకోడలు. అంతే మరి" అనడమే గాకండా వెంటనే సిద్దాంతుల్ని పిల్చి ముహుర్తాలూ పెట్టించేసేరు.

* * *

తన కిష్టమైన వాటి పన్లు తనే చేసుకునే దొరబాబు మండపేటెళ్ళి పెళ్ళికూతురికి కావాల్సిన నగలూ మంగళసూత్రాలూ పురమాయించుకొచ్చేడు. రామచంద్రపురం వెళ్ళి ఉడతా లోవరాజు బట్టలకొట్లో రకరకాల బట్టలు చింపించేడు. కాకినాడెళ్ళి బాటాషోరూమ్‌లో నల్లగా నిగనిగలాడే బూట్లు కొని తెచ్చుకున్నాడు.   పెళ్ళి పన్లన్నీ చకచకా సాగిపోతున్నాయి.

బసివిరెడ్డిగారి ఇల్లున్న కర్రోరివీధిలో ఆ చివర్నుంచి ఈ చివరికి పందిళ్ళు వేస్తున్నారు.

ఈ కులం ఆ కులం అని చూడకండా ఊళ్ళో అన్ని కులాలవాళ్ళనీ పిలిచేస్తున్నారు పెళ్లికి. వంటలకి ఎక్కడెక్కడినించో గుంపులు గుంపులుగా తోలుకొచ్చేస్తున్నారు మేకల్ని. చేగల్నాడ్నుంచి కొన్ని వందల నాటు కోళ్ళని తెప్పించేరు. ఊళ్ళో ప్రతి ఒక్కడూ తేతలి బసివిరెడ్డిగారి పెళ్ళి పన్లులోకే దూరిపోయి తిరుగుతున్నాడు.

* * *

అక్కలంతా కల్సి పెళ్ళికొడుకుని చెయ్యడానికి నలుగెట్టి స్నానం చేయించి తెల్లబట్టలు కట్టి, పెళ్ళిబొట్టు పై బుగ్గచుక్క పెట్టి పునుగూ జవ్వాదీ రాసి పిఠాపురం నూర్జహాను మొగలిసెంటులో దూదిముంచి దాన్ని చిన్న ఉండలా చుట్టి చెవిపై భాగంలో దూర్చేరు.

అందంగా తయారైపోయిన పెళ్లికొడుకు దొరబాబు, ఒక్కసారి సావిత్రికి కనిపించి వద్దామనుకుని వూలు సాక్సు వేసుకుని, నల్లనిబూట్లలో కాళ్ళు దూర్చి గట్టిగా ముళ్ళు వేసుకుని బయల్దేరిన దొరబాబు, పది అడుగులేసేడో లేదో పెద్దగా అరుస్తూ బోర్లా పడిపోయేడు.

ఆ అరుపులు విని పరిగెట్టుకొస్తున్నారంతా.

గిలగిలా కొట్టుకుంటా పెద్దగా అరుస్తున్న దొరబాబు నోట్లోంచి లుంగలుంగలు కింద వస్తున్నాయి తెల్లటినురగలు.

చుట్టూ మూగిన జనం భయపడిపోతా వళ్ళంతా తడుముతున్నారు.

ఉన్నట్టుండి తెల్లటి దొరబాబు శరీరం నీలంగా మారిపోయింది. ఇంకాస్సేపటికిదొరబాబు ప్రాణాలు పోయినియ్యి.

బట్టలన్నీ విప్పి చూసేరు.  ఏం లేదు.

బూట్లు విప్పితే కుడికాలి బూటులో శీతాకాలం చలికి బూటులోపల పడుకున్న చిన్న తాచుపాము పిల్ల తలకాయ చితికి చచ్చిపోయుంది.

దొరబాబు పెళ్ళికని, కొనుక్కొచ్చిన ఆ వస్తువులన్నీ అతని దినానికి పనికొచ్చినియ్యి.

* * *